# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 360 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | గురువారం| ఏప్రిల్ | 2 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## ఒకే ఒక రాజధాని అమరావతికి ఇక తిరుగులేదు: సీఎం చంద్రబాబు

అమరావతి,ఏప్రిల్,01:ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమం త్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌర వానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచపటం లో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతా మని ఆయన పునరుద్ఘాటిం చారు.



## కుప్పకూలిన సైనిక విమానం

### 29 మంది మృతి

మాస్కో : క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్- 26 మోడల్‌కు చెందిన విమానం మంగళవారం సాయంత్రం 6 గంటల (స్థానిక కాలమాన ప్రకారం)కు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది.



## తేయాకు తోటలో కూలీలతో కలిసి పని చేసిన మోడీ

- కూలీలతో ముచ్చటిస్తూ ఆకులు కోసిన ప్రధాని
- సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్

డిబ్రూఘర్: ప్రధాని మోడీ సామాన్యుడిలా మారిపోయారు. భద్రతా సిబ్బందిని పక్కన పెట్టి మరీ తేయాకు తోటలో కూలీలతో కలిసి పని చేస్తూ కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అస్సాంలో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల పోరు జరుగుతోంది. ప్రధాన పార్టీల మధ్య నువ్వానేనా? అన్నట్టుగా ఫైటింగ్ జరుగుతోంది. అయితే ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోడీ అస్సాం పర్యటనకు వచ్చారు. బుధవారం ఉదయం దిబ్రూగఢ్‌లోని తేయాకు తోటలకు వెళ్లారు. అక్కడ పని చేస్తున్న మహిళా కూలీలతో కలిసి తేయాకు ఆకులు కోశారు.వారితో ముచ్చటిస్తూ పని చేస్తూ కనిపించారు. అలాగే వారి సంస్కృతిని తెలుసుకుని సెల్ఫీ తీసుకున్నారు. అయితే దేశ ప్రధాని తమతో కలిసి పని చేయడంతో మహిళా కూలీల ంతా సంతోషంతో ఉ ప్పొంగిపోయారు. ఇందుకు సంబంధిం చిన ఫొటోలను ప్రధాని మోడీ తన ఎక్స్ ఖాతాలో పంచుకు న్నారు.తేయాకు అస్సాం ఆత్మ అని.. ప్రపంచవ్యాప్త గుర్తింపును సంపాదించుకుందని మోడీ రాసుకొచ్చారు. "ఈ ఉదయం దిబ్రుగఢ్‌లో నేను ఒక టీతోటను సందర్శించి.. అక్కడ పనిచే స్తున్న మహిళలతో మాట్లాడాను. అది నాకు ఎంతో గుర్తుం డిపోయే అనుభవం." అని మోడీ పేర్కొన్నారు.



## 2 వారాల్లో యుద్ధాన్ని.. ముగిస్తాం

### జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ వార్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక అప్‌డేట్ ఇవ్వనున్నారు. బుధవారం రాత్రి ఆయన అమెరికా ప్రజలను ఉద్దేశించి ప్రసంగి ంచనున్నారు. వైట్‌హౌజ్ ప్రెస్ కార్యదర్శి కరోలినా లివియట్ ఈ విషయాన్ని వెల్లడించారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని చెప్పారు. మరో వైపు ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతల్లో ఎటువంటి మార్పు లేదు. అమెరికా స్థావరాలపై ఇరాన్ అటాక్ చేస్తూనే ఉన్నది. కానీ వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్ మరో విషయాన్ని వెల్లడించారు. మరో రెండు లేదా మూడు వారాల్లో ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. త్వరలోనే ఆ దేశాన్ని వదలివెళ్తామని ఓవల్ ఆఫీసులో జరిగిన భేటీలో రిపోర్టర్లతో తెలిపారు. ఇరాన్‌లో ఉన్న అనేక క్షిపణి తయారీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. ఇరాన్‌ను మళ్లీ రాతియుగానికి పంపామని, బహుశా ఇప్పట్లో వాళ్లేమీ కోలుకోలేరని, ఆ దేశం న్యూక్లియర్ వెపన్ తయారు చేయలేదని ఆయన అన్నారు.



## కొండగట్టు అంజన్న ఆలయంలో.. అపశ్రుతి

### చలువ పందిరి కూలి 15 మందికి తీవ్రగాయాలు

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్స వాలు జరగ నున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.



## బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు

### కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

తిరువనంతపురం: కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్ని స్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనం తపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించా రు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీఓటు బ్యాం కును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిప డ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేరళలో పినరయి విజ యన్ సమయంఅయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చి ందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్య మంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.



## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

### *16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు*

### వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్1 : దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జార విడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది.




## 2027 నాటికి మామునూరు ఎయిర్ పోర్ట్

వరంగల్ , ఏప్రిల్ 1,: హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అం తర్జాతీయ విమానాశ్రయందేశంలోనే ప్రఖ్యాతిపొందిం ది. అయి తే ఇప్పుడు తెలంగాణలోని మరో ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో మరోసారి విమాన రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకా శం ఉందని కొందరు అంటున్నారు. వరంగల్ జిల్లా మూము నూరుఎయిర్ పోర్ట్ నిర్మాణానికిసంబంధించిసాంకేతిక సహాయ ం అందించేందుకు వరంగల్ నీట్ కు ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఎయి ర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయగా.. తదుపరి చర్యల్లో భాగంగా సాంకేతిక సహాయం తో పాటు సూపర్వైజింగ్ చేయాలని ప్రభుత్వం నీట్ ను కోరింది. దీంతో ఈ ఎయిర్పోర్ట్ పై ఇప్పుడు ఆసక్తిగా చర్చ సాగుతోంది.వరంగల్ జిల్లాలోని మామునూరు లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ. 850 కోట్లు అవసరం ఉండనుంది. ఇందులో ఆధునిక టెర్మినల్ భవనానికి, రహదారి ఏర్పాట్లకు, ట్రాఫిక్ కంట్రోల్ తో పాటు ఫైర్ సేఫ్టీ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 2027 చివరి నాటికి ఈ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది.



## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

### హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

న్యూఢిల్లీ, ఏప్రిల్1 : గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతు కుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలో ని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగం లో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం,మహిళా సాధికారత,భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తిం పుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీ లకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభి వృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# పారాక్వెట్ గడ్డి మందు నిషేధం లో కీలక పాత్ర పోషించిన జై స్వరాజ్ పార్టీ

- పూర్తి నిషేధానికి చర్యలు తీసుకోవాలి
- మందును నిషేధించిన ప్రభుత్వానికి రైతుల తరపున ధన్యవాదాలు
- జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ




హైదరాబాద్, ఏప్రిల్ 01: పారాక్వెట్ గడ్డి మందు నిషేధంలో జై స్వరాజ్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, తెలంగాణలో రోజుకు అనేక మంది రైతులు ఈ మందు కారణంగా చనిపోతున్న విషయాన్ని వ్యవసాయ అధికారులకు తాను వివరించానని, అదే విధంగా ప్రభుత్వానికి లేఖ రాశామని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వెంటనే గడ్డి మందును ముందుగా 60 రోజుల నిషేధానికి ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు రైతుల మేలు కోరుకునే జై స్వరాజ్ పార్టీ రైతుల తరఫున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నదని, అలాగే శాశ్వత నిషేధానికి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని కేఎస్ఆర్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తదుపరి పూర్తి నిషేధానికి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆయన కోరారు. వ్యవసాయ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెస్టిసైడ్ షాపుల్లో ఈ గడ్డి మందు లేకుండా చేయాలని ఆయన ప్రభుత్వానికి తెలిపారు.

# పినపాక అభివృద్ధికి వేగం పెంచాలి

-మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి



**హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 01:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కీలక చర్యలు చేపట్టారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను సచివాలయంలోని ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గం లోని మణుగూరు, పినపాక, అశ్వాపురం, కరకాగూడెం, గుండాల, అల్లపల్లి, బూర్గంపాడు మండలాల్లో మారుమూల ఏజెన్సీ గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ప్రధాన, అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో ఎత్తైన వంతెనల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మహిళా, శిశు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏడు మండలాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 173 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో ప్రస్తావించారు. అలాగే ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వారి వేతనాలను పెంచి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఈ వినతిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, రహదారులు, వంతెనలు, అంగన్‌వాడీ భవనాలు, ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ భేటీతో పినపాక నియోజకవర్గంలో రవాణా సదుపాయాల మెరుగుదల, శాశ్వత అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో గణనీయమైన పురోగతి సాధ్యమవుతుందని స్థానిక నాయకులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- పాత్రికేయులను నిర్లక్ష్యం చేయడం సరికాదు
- సీఎం రేవంత్ రెడ్డికి ఐఎఫ్ డబ్ల్యూజే లేఖ..

**హైదరాబాద్,మహానది న్యూస్,ఏప్రిల్ 01:** **తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ ఉపాధ్యక్షుడు (న్యూఢిల్లీ) మోహన్ కుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ పంపారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా సేవలందిస్తున్న పాత్రికేయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా పంపిన లేఖ పూర్తి భాగం యథాతథంగా...**

**ఎ. రేవంత్ రెడ్డి గారికి**
**ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం.**

**విషయం:** తెలంగాణ రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపు, చిన్న, మధ్యతరహా పత్రికల ప్రకటనల బకాయిల చెల్లింపు,ఎంప్యానెల్‌మెంట్, పింఛను పథకం, అక్రిడిటేషన్ కార్డులు, కేబుల్ ఛానెళ్ల గుర్తింపు, మరియు పాత్రికేయుల రక్షణ చట్టం అమలు.

**అయ్యా...**

తెలంగాణ రాష్ట్రంలో పాత్రికేయ సమాజం, మీడియా వ్యవస్థ పట్ల దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించి, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ **(IFWJ)** తరపున, నేను మీకు తీవ్ర ఆందోళన, అత్యవసర పరిస్థితిలో ఈ లేఖ రాస్తున్నాను. నేను ఈ రోజు లేవనెత్తుతున్న విషయాలు కేవలం పరిపాలనాపరమైన ఫిర్యాదులు మాత్రమే కాదు. అవి పత్రికా స్వేచ్ఛ, వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టుల జీవనోపాధి, సామాన్య ప్రజల గొంతుకగా నిలిచే చిన్న, మధ్యతరహా పత్రికల మనుగడకు సంబంధించినవి.

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమానికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. గత రెండేళ్లుగా ప్రభుత్వం పాత్రికేయుల, చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల, పీరియాడికల్స్ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ ప్రకటనలు విడుదల చేయకపోవడం, బకాయి ఉన్న ప్రకటనల బిల్లులు చెల్లించకపోవడం వల్ల అనేక మంది ప్రచురణకర్తలు, ఆయా పత్రికల్లో పని చేస్తున్న పాత్రికేయులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయారు. గత కొన్ని నెలలుగా, పీరియాడికల్స్‌కు ప్రభుత్వ ప్రకటనలు పూర్తిగా నిలిపివేశారు. ఒకవైపు సరైన ప్రభుత్వ ప్రకటనలు లేకపోవడం, మరోవైపు బకాయి ఉన్న బిల్లులు చెల్లించకపోవడం వల్ల అనేక చిన్న, మధ్యతరహా వార్తాపత్రికలు, పీరియాడికల్స్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల, ఈ వార్తాపత్రికలనే తమ ఏకైక జీవనాధారంగా చేసుకున్న ఎంతోమంది పాత్రికేయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి కూరుకుపోయారు. దీంతో పాటు, రాష్ట్రంలోని అనేక చిన్న, మధ్యతరహా వార్తాపత్రికలు ఎంప్యానెల్‌మెంట్ కోసం చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. చెల్లుబాటు అయ్యే ఆర్ఎన్ఐ/పీఆర్జీఐ అనుమతులతో నడుస్తున్న వార్తాపత్రికలకు అక్రిడిటేషన్ కార్డుల కనీస గౌరవాన్ని కూడా నిరాకరిస్తున్నారు. అదేవిధంగా, కేబుల్ ఛానెళ్లకు అక్రిడిటేషన్లు జారీ చేయడంపై స్పష్టత లేదు. గతంలో జారీ చేసిన విధంగానే కేబుల్ ఛానెళ్లకు అక్రిడిటేషన్ కార్డులను పునరుద్ధరించేందుకు జీవో 252ను సవరించాలి. జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కూడా కేటాయించలేదు. సీనియర్ జర్నలిస్టులకు పింఛన్లు అందిస్తున్న అనేక ఇతర రాష్ట్రాల మాదిరిగా కాకుండా, తెలంగాణలో ఒక్క సీనియర్ జర్నలిస్టు కూడా పింఛను పొందడం లేదు. ఈ తీవ్రమైన సమస్యలపై, మా ఐఎఫ్‌డబ్ల్యూజే తెలంగాణ రాష్ట్ర నాయకులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య నేతృత్వంలో భారీ "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ నెల 25వ తేదీన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాత్రికేయులను ఒకచోట చేర్చి, వారి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం జరుగింది. ఈ పాత్రికేయుల ఆందోళన ఆవేదనలను మీరు తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని మేము అభ్యర్థిస్తున్నాం. అత్యంత జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఒక విషయాన్ని కూడా మేము మీ దృష్టిని తీసుకొస్తున్నాం. దివంగత డాక్టర్ కె. విక్రమ్ రావు–ఒక ప్రఖ్యాత పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమర యోధుడు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ **(IFWJ)** మాజీ అధ్యక్షుడు. తన విశిష్ట జీవితంలో దశాబ్దాలను పత్రికా స్వేచ్ఛ, పాత్రికేయుల రక్షణ కోసం అంకితం చేశారు. పాత్రికేయులను వారి వృత్తిపరమైన విధులను నిర్వర్తించడం వల్ల ఎదురయ్యే భౌతిక దాడులు, అక్రమ నిర్బంధం, బెదిరింపుల నుండి కాపాడేందుకు ఒక సమగ్ర చట్టమైన పాత్రికేయుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలనేది ఆయన ఆశయం. అత్యంత శాశ్వతమైన, తీవ్రమైన డిమాండ్లలో ఇదొకటి.

డాక్టర్ విక్రమ్ రావు యొక్క ఆశయం భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో ఇప్పటికే కార్యరూపం దాల్చడం ప్రారంభమైందని మీకు తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, మీడియా నిపుణులపై దాడులు,బెదిరింపుల నుండి వారికి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు పాత్రికేయుల రక్షణ చట్టాన్ని రూపొందించింది. అదేవిధంగా మహారాష్ట్ర రాష్ట్రం కూడా అటువంటి చట్టాన్ని రూపొందించి, ప్రత్యేక అమలు యంత్రాంగంతో దానిని అమలులోకి తెచ్చింది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలు, పాత్రికేయుల రక్షణ కోసం ఇలాంటి చట్టాలను అధ్యయనం చేయడానికి, అమలు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేశాయి. ప్రగతిశీల, దూరదృష్టి గల రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రం కూడా వెనుకబడకుండా, వీలైనంత త్వరగా తెలంగాణ జర్నలిస్టుల కోసం రక్షణ చట్టాన్ని రూపొందించి, మహనీయుడైన డాక్టర్ కె. విక్రమ్ రావు ఆశయాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పాత్రికేయుల రాజకీయ అనుబంధాలు, వారి ప్రచురణల పరిమాణం, లేదా వారి పని మాధ్యమంతో సంబంధం లేకుండా, వారి పట్ల ఎలాంటి వివక్ష లేకుండా, ఈ క్రింది అత్యవసర సమస్యలను సానుకూలంగా పరిష్కరించవలసిందిగా మేము మీ గౌరవానికి మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

## వెంటనే పరిష్కరించవలసిన డిమాండ్లు

–రాష్ట్ర బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి.

–చిన్న,మధ్య తరహా వార్తాపత్రికలు, పీరియాడికల్స్‌కు చెల్లించవలసిన ప్రకటనల బకాయిలను వెంటనే చెల్లించాలి.

–నిరూపితమైన క్రమబద్ధత కలిగిన చిన్న, మధ్య తరహా దినపత్రికలు, పీరియాడికల్స్‌ను మరింత ఆలస్యం చేయకుండా ఎంప్యానెల్ చేయాలి.

–ఎలాంటి వివక్ష లేకుండా, పెద్ద వార్తాపత్రికలతో సమానంగా చిన్న వార్తాపత్రికలకు కూడా ప్రభుత్వ ప్రకటనలు క్రమం తప్పకుండా విడుదల చేయాలి.

–చెల్లుబాటు అయ్యే **RNI/PRGI** రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న, ఎంప్యానెల్‌లో లేని వార్తాపత్రికలకు తాత్కాలిక చర్యగా అక్రిడిటేషన్ కార్డులు అందించాలి.

–కేబుల్ టీవీ ఛానెళ్లకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. ఈ సౌకర్యాన్ని పునరుద్ధరించడానికి జీవో 252ను తగిన విధంగా సవరించాలి.

–అర్హులైన పాత్రికేయులందరికీ ప్రాధాన్యతా క్రమంలో అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు జారీ చేయాలి.

–ఇళ్ళస్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, పాత్రికేయులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

–అనేక ఇతర రాష్ట్రాలలో అనుసరిస్తున్న పద్ధతికి అనుగుణంగా, పదవీ విరమణ చేసిన సీనియర్ పాత్రికేయులకు నెలవారీ పింఛను ఇవ్వాలి.


–ఐఎఫ్‌డబ్ల్యూజే మాజీ అధ్యక్షులు దివంగత డాక్టర్ కె. విక్రమ్ రావు దార్శనికత స్ఫూర్తితో, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో ఇప్పటికే అమల్లోకి వచ్చిన చట్టాల తరహాలో తెలంగాణలో పాత్రికేయుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి.

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నఈసమస్యలకు మీ గౌరవానికి ప్రాధాన్యతనిచ్చి, తెలంగాణ పాత్రికేయ సమాజం యొక్క సమస్యలను పరిష్కరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటారని మేము ఆశిస్తున్నాం. విశ్వసిస్తున్నాం ఐఎఫ్ డబ్ల్యూజే సభ్యులు,తెలంగాణపాత్రికేయులు మీ నాయకత్వం పై గొప్ప విశ్వాసంతో, అంచనాలతో ఎదురు చూస్తున్నారు.

**అత్యంత గౌరవపూర్వకంగా సోదరభావంతో....**

**మీ విశ్వాసపాత్రుడు,**
**మోహన్ కుమార్**
**ఉపాధ్యక్షుడు (ఐఎఫ్‌డబ్ల్యూజే) న్యూఢిల్లీ**

**1.ముఖ్య కార్యదర్శి, సమాచార & పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్.**
**2.మామిడి సోమయ్య, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (IFWJ-తెలంగాణ), హైదరాబాద్.**



INDIAN FEDERATION OF WORKING JOURNALISTS
(Founded on 28 October 1950 at Jantar Mantar in New Delhi and registered as Trade Union no: 1992)
M-606, Habitat Society, Vasundhara Enclave, Delhi-110091
President's address: 7 Gulistan Colony, Bandariabagh, Lucknow-226001, U.P.
IFWJ Phones. : +91 9415000909/ +91 9818627033
E-mail : ifwj.media@gmail.com / k.vikramrao@gmail.com Website : www.ifwj.in

| President | Secretary General | Vice President | Treasurer |
| --- | --- | --- | --- |
| Lt.Dr K Vikram Rao | Vipin Dhuliya | Gopal Mishra (Delhi) Mohan Kumar (Bihar) Upendra Singh Rathod (Rajasthan) | Rajat K Mishra |

Date: 31st March 2026

To,
Shri **A. Revanth Reddy Garu**
Hon'ble Chief Minister,
Government of Telangana,
Hyderabad.

*Subject: Budget allocation for the welfare of journalists, payment of advertisement bill dues of small and medium newspapers, empanelment, pension scheme, accreditation cards, identification of cable channels, and enactment of a Journalist Protection Act in the State of Telangana.*

Sir,

On behalf of the Indian Federation of Working Journalists (IFWJ), I write to you with great concern and a sense of urgency regarding the long-standing neglect of the journalistic community and the media ecosystem in the State of Telangana. The matters I raise today are not merely administrative grievances — they touch upon the very freedom of the press, the livelihoods of hundreds of working journalists, and the sustainability of small and medium newspapers that serve as the voice of the common people.

Page 1 of 5

1

# జర్నలిస్టులు పోరాడి హక్కులను సాధించుకోవాలి

## - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య...

వేములవాడ, మహానది న్యూస్,ఏప్రిల్ 01: జర్నలిస్టులు తమ హక్కులను సాధించుకునేందుకు ఐక్యంగా పోరాటాలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవ స్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరుకాపు భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా జర్నలిస్టులకు కనీసం అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విరోచిత పాత్ర పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం విస్మరించిందని, ఈ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా సమస్యలు పరిష్కరించకుండా తీవ్ర వివక్ష చూపుతుందని అన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జర్నలిస్టులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇండ్లు ఇండ్లస్థలాలు, హెల్త్ కార్డులు, పెన్షన్ వంటి డిమాండ్ల సాధనకై జర్నలిస్టులు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ కుడితాడు బాపురావు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. జిల్లాలో ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెరుక రవి అధ్యక్షత వహించగా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, వేముల వాడ కన్వీనర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.






### వేములవాడ కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వేములవాడ నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష పదవికి కొప్పుల ప్రసాద్, బొప్ప బిక్షపతి పోటీ పడగా జరిగిన రహస్య బ్యాలెట్ ఓటింగ్ లో అధ్యక్షునిగా బొప్ప బిక్షపతి (ప్రజా జ్యోతి) గెలుపొందారు. కార్యదర్శిగా గొల్లపల్లి వేణు (ఇంద్రప్రభ), ఉపాధ్యక్షులుగా కవ్వాల సురేందర్, కోశాధికారిగా సాహెద్ పాషా, జాయింట్ సెక్రెటరీలుగా ఏం సంజీవ్, చింతల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నడిగట్ల మధు, చక్రహరి దేవేందర్ రాజ, నడికట్ల బిక్షపతి, బోడ్ల భరత్ బాబు, కొమురవెల్లి మునిష్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను, ఎన్నికైన వేములవాడ కమిటీ నాయకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.





# సంపాదకీయం

## ముందస్తు చర్యలతో భారత్ స్థిరం

గల్ఫ్ యుద్ధం కారణంగా అత్యంత ప్రభావితం అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటి. మన దేశంలో చమురు, ఎల్‌పీజీ వినియోగం పెరిగిన కారణంగా మన గల్ఫ్ దేశాలపై ఆధారపడి ఉన్నాం. దీంతో మనం కూడా ప్రభావితం అవుతున్నాం. 90 శాతం చమురు, ఎల్‌పీసీ 60 శాతం, ఎల్ఎన్‌జీ 50 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. పూర్తిగా గల్ఫ్‌గా, చమురు ఉత్పత్తి దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నా. బ్యాదల్ మాండెల్, ఆర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు వచ్చినా ప్రభావితం అవుతున్నాం. కానీ తట్టుకుని నిలబడుతున్నాం.భారత్ గల్ఫ్ దేశాల నుంచి 90% క్రూడ్ ఆయిల్, 60% ఎల్‌పీజీ, 50% ఎల్ఎన్‌జీ దిగుమతి చేస్తోంది, ఇది రోజువారీ వినియోగాన్ని 5 మిలియన్ బ్యారెళ్లకు చేర్చింది. బ్యాబ్ ఎల్ మండబ్, స్ట్రెయిట్ ఆఫ్ హోర్మూజ్ జలసంధుల్లో దాడులు జరిగినా, రోజుకు 7?8 మిలియన్ బ్యారెళ్ల సరఫరా దెబ్బతింటుంది. ధరలు 20% పెరిగి బ్యారెల్‌కు 95 డాలర్లు దాటింది. దీని వల్ల దిగుమతి ఖర్చు వారానికి రూ.15 వేల కోట్లు పెరిగింది. భారత్ ముందస్తున ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఎక్కువ నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 25 రోజులకు సరిపోయే క్రూడ్ నిల్వలు, ఎల్‌పీజీ 30 రోజులకు, పెట్రోల్, డీజిల్ 25 రోజులకు, ఎల్ఎన్‌జీ పది రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా వాడుకోవడం ద్వారా ప్రస్తుతం క్రైసిస్ నుంచి బయటపడే వీలు ఉంటుంది.భారత్ మూడు రకాలుగా ప్రయత్నం చేస్తోంది. వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తోంది. రష్యా నుంచి 30 బిలియన్ బ్యారెళ్ల ఇంధనం దిగుమతి చేసుకుంటున్నాం. అంగోలా నుంచి 3.4 మిలియన్ బ్యారెళ్లు, కాంగో నుంచి 1.3 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. వీటిద్వారా మనపై యుద్ధ ప్రభావం తగ్గించుకుంటున్నాం. ఒక దేశంపై ఆధారపడకుండా 40 దేశాల నుంచి చమురు కొంటున్నాం. ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న గల్ఫ్ దేశాల నుంచి 70 శాతం చమురు ఆగిపోయింది. అయినా ఇబ్బంది లేదు. దౌత్యపరంగా ఇరాన్‌తో మాట్లాడడంతో మన ఓడలు సురక్షితంగా భారత్‌కు వస్తున్నాయి.మోదీ అదికారంలోకి వచ్చాక మన స్ట్రాటజిక్ రిజర్వులు పెంచేందుకు ఇండియన్ స్టాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దేశంలో మూడు ప్రాంతాల్లో చమురు నిల్వ చేస్తోంది. అండర్‌గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున చమురు నిల్వలు చేస్తోంది. భూమి ఉపరితలం నుంచి 500 మీటర్ల లోపల స్టోరేజీ కెపాసిటీ ఉంది. 10 ఏళ్ల క్రితం విశాఖపట్టణంలో ఏర్పాటు చేశారు. తర్వాత తమిళనాడులోని పాదూర్‌లో రిజర్వులు ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో కూడా నిర్వలు ఏర్పాటు చేశారు. విశాఖపట్టణంలో 60 మిలియన్ టన్నుల నిల్వల సామర్థ్యం ఉంది. మంగళూరులో 20 వేల టన్నులు, పాదూరులో కూడా 20 వేల టన్నులు నిల్వ సామర్థ్యం ఉంది.వార్షికంగా మనకు 31 మి.టి ఎల్‌పీజీ అవసరం ప్రస్తుతం 20% కొరత ఉన్నా, కమర్షియల్ (హోటల్స్, ఇండస్ట్రీలు) వాడకంపై 25% కోత పెట్టి 80% గృహావసరాలు (10 మి.టి.) రక్షించారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ కనెక్షనుల గణనీయంగా ఇచ్చారు. ప్రస్తుతం 33 కోట్ల కనెక్షన్లు ఉన్నాయి. బాటలింగ్ స్టేషన్లు 23 మెట్రిక్ టన్నులకు పెంచారు. ఈ స్టేషన్లు 186 నుంచి 210కి పెంచాం. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు 13 వేల నుంచి 25 వేలకు పెరిగారు. వాడకం పెరిగింది. అందుకు తగినట్లుగా ఉజ్వల్ యోజన కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ఒడిదుడుకులు ఉన్నా భారత్ తట్టుకుంటోంది.మిగతా దేశాలతో పోలిస్తే మనం ప్రభావితం కావడం లేదు. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ మాత్రం తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. మోదీ ప్రభుత్వ ముందచూపు ఇప్పుడు మనల్ని సురక్షితంగా ఉంచింది. పెరుగుతున్న ఇంధన ధరలు, అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిణామాల నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గ్యాస్ వినియోగాన్ని పొదుపుగా చేయాలని ఆమె చేసిన సూచనలు ఆసక్తిని రేపుతున్నాయి. ప్రజలు గ్యాస్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని కోరారు. ఇది కేవలం ఆర్థిక పొదుపు కోసమే కాకుండా, దేశ ఇంధన భద్రత దృష్ట్యా కూడా అవసరమని ఆమె పేర్కొన్నారు.ఉక్రెయిన్–రష్యా, ఇరాన్–అమెరికా మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా సహజ వాయువు సరఫరాపై ప్రభావం పడింది. దిగుమతి చేసుకునే గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వంపై భారం పడుతోంది. దేశీయంగా గ్యాస్ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలంటే వినియోగదారులు కూడా తమ వంతు బాధ్యతగా అనవసర వినియోగాన్ని తగ్గించాలని ఆమె సూచించారు. వంట గ్యాస్ పై ఆధారపడటం తగ్గించి, సౌర శక్తి లేదా ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రజలు మళ్లాలని ఆమె కోరారు.పారిశ్రామిక రంగంలో కూడా గ్యాస్ వాడకంలో అత్యాధునిక సాంకేతికతను వాడి వృథాను అరికట్టాలని ఆమె కోరారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడికి భారంగా మారాయని, ఇలాంటి సమయంలో వినియోగం తగ్గించుకోమనడం ఎంతవరకు సమంజసం అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పొదుపు పాటించడం మంచిదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి వచ్చిన ఈ సూచన, రాబోయే రోజుల్లో ఇంధన కొరత ఏర్పడే అవకాశం ఉందనే సంకేతాన్ని ఇస్తోంది. అటు ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకోవాలని చూస్తుంటే, ఇటు సామాన్యుడు మాత్రం ధరల సెగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు..

# ఆటిజం అంటే ఏమిటి? పిల్లల్లో ఆటిజం ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి?

## నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం..

డాక్టర్ మనోజ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్
ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముషీరాబాద్



హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 01: కొందరు పిల్లలు చురుకుగా వ్యవహరించకుండా.. ఎవరితోనూ కలవకుండా.. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, సరిగా మాట్లాడలేక పోతుండడం వంటి లక్షణాలు కలిగి ఉండడాన్ని మందబుద్ధి లేదా ఆటిజం అని పిలుస్తారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముషీరాబాద్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి ఆటిజం అంటే ఏమిటి? పిల్లల్లో ఆటిజం ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి? అనే విషయాలను వివరించారు. ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

కొందరు పిల్లలు చురుకుగా వ్యవహరించకుండా.. ఎవరితోనూ కలవకుండా.. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, సరిగా మాట్లాడలేక పోతుండడం వంటి లక్షణాలు కలిగి ఉండడాన్ని మందబుద్ధి.. ఆటిజం అని పిలుస్తారు. తల్లి దగ్గరకు తీసుకుంటున్నప్పటికీ.. చిన్నారి సరిగా స్పందించకపోవడం ఆటిజం మరో లక్షణం.

శిశువుకు 3 నెలలు వచ్చినప్పటి నుంచే తల్లిని గుర్తుపడతారు. చూపుతో చూపు కలుపుతారు. కళ్లలో కళ్లు పెట్టి నవ్వితే నవ్వుతారు. అయితే 'ఆటిజం' పిల్లల్లో చూపు మామూలుగానే ఉంటుంది కానీ తల్లిదండ్రులను గుర్తుపట్టలేరు. వినికిడి సాధారణంగానే ఉంటుంది. కానీ పేరు పెట్టి పిలిస్తే మన వైపు చూడరు. 'ఆటిజం'లో ఇదొక ప్రధాన లక్షణం. మన దేశంలో దాదాపు 2 శాతం పిల్లలు ఈ రకమైన జబ్బుతో బాధపడుతున్నారు. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లోపం తల్లిదండ్రులకు శాపంగా మారుతోంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, ఆటిజం అనేది మెదడు అభివృద్ధిని ప్రభావితం చేసే రుగ్మతల్లో ఒకటి. ఇది అనేక రకాల లక్షణాల ద్వారా బయటపడుతుంది. నిద్రలేమి, స్వీయ-గాయాల వంటి సమస్యాత్మక ప్రవర్తనలతో పాటు, ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తులు తరచుగా మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్యాక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలను కలిగి ఉంటారు.

**ప్రపంచ ఆటిజం అవగాహన దినం:**

ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయం చేయవలసిన అవసరాన్ని ప్రపంచం దృష్టికి తీసుకురావడానికి, వారు సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా గుర్తింపు పొందడానికి, అర్థవంతమైన జీవితాలను ఆస్వాదించడానికి, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఏప్రిల్ 2వ తేదీని అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినంగా ప్రకటించింది. పిల్లల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు.

ఆటిజం అంటే ఏమిటి?ఆటిజం అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే జీవితకాల నాడీ సంబంధిత రుగ్మత, ఇది జాతి, సామాజిక ఆర్థిక లేదా లింగ బేధాలు లేని రుగ్మత. "ఆటిజం స్పెక్ట్రమ్" (ఏఎస్ డీ) అనే పదం విస్తృతమైన లక్షణాలను వివరించడానికి ఉపయోగిస్తారు. ఆటిజంతో బాధపడుతున్న వారు సమానమైన చికిత్స పొందేందుకు, ఒకే రకమైన సహాయం పొందేందుకు హక్కును కలిగి ఉంటారు. ఆటిజంపై అవగాహనతో వారికి సమాజం పూర్తిగా సహకరించవచ్చు.

ఆటిజం లక్షణాలు ఏఎస్ డీ అనేది అభివృద్ధి క్రమరాహిత్యం, ఇది సామాజికంగా కమ్యూనికేట్ చేయడానికి, ప్రవర్తించే వ్యక్తి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. దీని మూలం సాధారణంగా జన్యుపరమైనది అయినప్పటికీ, ఏఎస్ డీ కి ఎటువంటి చికిత్స లేదు. అయినప్పటికీ, ముఖ్యమైన జీవనశైలిలో మార్పులు అమలు చేయడం ద్వారా పిల్లల్లో ఈ సమస్య మరింత పెరగకుండా చర్యలు తీసుకోవచ్చు.

ఎలా తగ్గించాలి? తల్లులు నిర్దిష్ట పోషకాలు, సప్లిమెంట్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల వారి పిల్లలలో ఆటిజం ప్రమాదాన్ని తగ్గించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మరోవైపు, గర్భధారణ సమయంలో



వాయు కాలుష్యం, ముఖ్యంగా భారీ లోహాలు, పర్టిక్యులేట్ పదార్థాల ప్రభావానికి గురికావడం ఏఎస్ డీ ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుందని వివిధ అధ్యయనాలు పేర్కొన్నాయి.

కాబోయే తల్లులు వారి ప్రినేటల్ అపాయింట్‌మెంట్‌లకు క్రమం తప్పకుండా హాజరు కావడం, కడుపులోని బిడ్డ ఎదుగుదల క్రమాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం. పిల్లలకి ఏఎస్ డీ ఉన్నట్లు నిర్ధారణ అయితే, ముందస్తు చర్యల ద్వారా వారి కమ్యూనికేషన్, సామాజిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అవకాశముంది.

తల్లులు తమ శిశువులలో ఆటిజంను నివారించడానికి అనేక చర్యలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు, సమస్యలను ముందుగానే గుర్తించడానికి సాధారణ ప్రినేటల్ చెక్-అప్‌లకు హాజరుకావడం తప్పనిసరి అని స్పష్టంచేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు, ఒత్తిడిని తగ్గించడానికి వ్యాయామాలు చేయడం, హానికరమైన ప్రభావాలను నివారించడం. ధూమపానం, ఆల్కహాల్, డ్రగ్స్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కొన్ని రకాల అనారోగ్యాలను నియంత్రించే టీకాలు తీసుకోవాలని, కడుపులో శిశువు కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ముందస్తు చర్యల్లో భాగమని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

శిశువు కదలికలకు సంబంధించి ఏవైనా అనుమానిత లక్షణాలు గుర్తిస్తే, తదుపరి పరీక్షల కోసం వాటిని ఆరోగ్య సంరక్షణ ప్రదాతకి నివేదించడం చాలా అవసరం. ఈ చర్యల ద్వారా, తల్లులు తమ బిడ్డకు ఆటిజం వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

# మంత్రివర్గ మార్పులపై ఊహాగానాలు

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీ కరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టబోతున్నారనే ఊహాగా నాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు సీఎం సిద్ధమవుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయిముఖ్యమ ంత్రి చంద్రబాబు తన పాలనలో ఎప్పుడూ క్రమశిక్షణకు, పనితీరుకు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరుపై ఆయన సంతృప్తిగా లేరని, అందుకే సుమారు 10 మంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారిని పదవుల నుండి తొలగించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.ప్రధానంగా మంత్రుల పనితీరును అంచనా వేయడానికి కొన్ని కీలక ప్రమాణాలను ఆయన ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారు? ఎంతమేరకు పట్టు సాధించారని బేరీజు వేస్తున్నారు. పాలనలో అధికారులతో కలిసి ఎలా పని చేస్తున్నారు? ఎన్ని సమీక్షా సమావేశాలు నిర్వహించారు? కేంద్ర ప్రభుత్వం నుండి తమ శాఖలకు రావాల్సిన నిధులను రాబట్టడంలో ఎంతవరకు సఫలీకృతులయ్యారు? ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ఏ మేరకు కృషి చేశారు? ఎన్ని ప్రెస్ మీట్స్ నిర్వహించి ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టారు? .. లాంటి అంశాలపై చంద్రబాబు నివేదికలు రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది.ప్రతి మంత్రికీ ఒక ప్రోగ్రెస్ కార్డ్ సిద్ధమవుతోంది. ఈ నివేదికలు కేవలం పైపైన పరిశీలనతో కాకుండా, ప్రతి నిమిషం వారి పనితీరును పర్యవేక్షించి తయారు చేస్తున్నారు. ఈ రిపోర్టుల ఆధారంగానే ఎవరిని కొనసాగించాలి, ఎవరికి ఉద్వాసన పలకాలి అనే విషయంలో సీఎం ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామం ప్రస్తుతం ఉన్న చాలా మంది మంత్రులకు నిద్ర లేకుండా చేస్తోంది.ఈసారి జరగబోయే మార్పుల్లో లోకేశ్ టీంకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, లోకేష్‌కు అండగా ఉండేలా ఉత్సాహవంతులైన నాయకులకు, యువకులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే వారికే ఈసారి పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం.ఈ మంత్రివర్గ మార్పులు కేవలం పరిపాలన కోసమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉంటాయని తెలుస్తోంది. ఎన్నికలకు వెళ్లే ముందు బలమైన టీమ్‌ను సిద్ధం చేసుకోవడం చంద్రబాబు వ్యూహం. ఉగాది పండుగ నాటికి లేదా మరో రెండు మూడు నెలల్లో ఈ మార్పులు ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా కేబినెట్ మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు.మొత్తానికి ఏపీ క్యాబినెట్‌లో రాబోయే మార్పులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, అది ప్రభుత్వ పనితీరులో వేగాన్ని పెంచే ప్రయత్నం. 10 మంది మంత్రుల శాఖల మార్పు, కొత్త రక్తానికి అవకాశం ఇవ్వడం ద్వారా పాలనలో కొత్త ఉత్తేజాన్ని తీసుకురావాలని చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రోగ్రెస్ కార్డ్ రాజకీయాల్లో ఎవరి భవిష్యత్తును నిర్ణయిస్తుందో వేచి చూడాలి.

కూటమి పార్టీలు..: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నారా లోకేశ్ ఒకరకంగా భావి నేతగా అవతరిస్తున్నారు. నారా లోకేశ్ విభిన్నశైలిని చూసిన వారికి ఎవరికైనా త్వరలోనే ఆయన కీలక పదవి అధిష్టించే అవకాశముందని అంచనా వేస్తారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హయాంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీ ఇక్కడ నారా లోకేశ్ మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా? ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు.సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేశ్ దానికి విభిన్నంగా వ్యవహరిస్తున్నారు.. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్ అయ్యింది. దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యప రిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవ డానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమా పణలు చెప్పారు. బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు. ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయమని కూడా అంటున్నారునారా లోకేశ్ విషయంలో కూటమి పార్టీల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఏమీ లేనట్లే కనిపిస్తుంది. నారా లోకేశ్ పర్యవేక్షణలోనే పరిపాలన నడుస్తుం దని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు తెలుసు. కానీ వారు మాత్రం దానిని పాజిటివ్ గానే తీసుకుంటున్నారు. ఎటూ జరిగేది అదేనని, అత్యధిక స్థానాలతో అధికారంలో ఉన్న టీడీపీలో నాయకత్వ బాధ్యతను ఎవరికి అప్పగించాలన్నది ఆ పార్టీ నేతల ఇష్టమన్న అభిప్రాయానికి వచ్చేసినట్లు కనిపిస్తుంది. లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్క రించే విషయంలో నారా లోకేశ్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు.

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ది సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్యాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి.అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వా న్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్‌మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయులను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!.%శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 – 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్తోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా–లినోలినిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అందానికి ఆహారం



వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ా%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?





## అనేక వ్యాధులు నయమవుతాయి..!

ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది. మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

డయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

## సోప్ నెయిల్స్ చూశారా?!



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

## 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

# నల్ల టమాటాలు.. ఎంతో మేలు



టమాటాలు అనగానే.. ఎర్రగా బుర్రగా కనిపిస్తాయి. కానీ, ఇప్పుడు నలుపు, ముదురు ఊదా రంగుల్లోని 'బ్లాక్ చెర్రీ టమాటాలు' మార్కెట్లోకి వస్తున్నాయి. చూసేందుకే కాదు.. రుచితోపాటు ఆరోగ్యప్రయోజనాల్లోనూ ఇవి ఎంతో ప్రత్యేకమని నిపుణులు చెబుతున్నారు. ఈ నల్లటి టమాటాల్లో దాగి ఉన్న 'సూపర్ పవర్స్'ను వివరిస్తున్నారు. బ్లాక్ చెర్రీ టమాటాల్లో 'ఆంతోసైనిన్స్' అనే యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటివల్లే వాటికి ఆ ముదురు రంగు వస్తుంది.

ఈ ఆంతోసైనిన్స్.. గుండె ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎంతో సాయపడతాయి. శరీరంలోని కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. వృద్ధాప్య ఛాయలనూ తగ్గిస్తాయి. వీటిలోని విటమిన్ ఎ, బీటా కెరోటిన్.. కంటి చూపును మెరుగుపరుస్తాయి. రేచీకటి వంటి సమస్యలు రాకుండా చూస్తాయి. అందుకే, డిజిటల్ స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడిపే నేటితరానికి ఈ టమాటాలు ఒక వరమనే చెప్పాలి.

ఇందులో అధిక మొత్తంలో లభించే లైకోపీన్, పొటాషియం.. గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయి. ఇక ఇందులోని పొటాషియం.. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. నల్ల టమాటాల్లోని విటమిన్ సి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. గాయాలు త్వరగా మానేలా చేస్తుంది. బ్లాక్ చెర్రీ టమాటాల్లో పీచు పదార్థం ఎక్కువ. కాబట్టి, జీర్ణక్రియ సమస్యలు, మలబద్ధకంతో బాధపడేవారికి మంచి ఉపశమనం దొరుకుతుంది. ఇక ఇందులో కేలరీలు చాలా తక్కువగా, నీటి శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బరువు తగ్గాలనుకునేవారికి అద్భుతమైన ఆహారం అని చెప్పొచ్చు.

# ఆనందం కావాలా నాయనా!



ఆనందంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. కానీ, ఉరుకుల పరుగుల జీవితంలో పడి.. చిన్నచిన్న సంతోషాలను కూడా కోల్పోతుంటారు. అలాంటివారి కోసం.. ఫిన్లాండ్ ప్రభుత్వం, అక్కడి పర్యాటక శాఖ ఓ అద్భుతమైన అవకాశం అందిస్తున్నది. తమ దేశంలో పర్యటిస్తే.. ఆనందంగా జీవించడం ఎలాగో నేర్పుతామని చెబుతున్నది. ఇందుకోసం ఫిన్లాండ్‌వాసిగా ఆనందంగా గడపండి అంటూ.. 'చిల్ లైక్ ఏ ఫిన్' అనే కార్యక్రమం ఏర్పాటు చేసింది. వరుసగా ఎనిమిది సార్లు ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా నిలిచింది ఫిన్లాండ్. తమ దేశప్రజల సంతోష రహస్యాలను ప్రపంచంతో పంచుకోవడానికి ఓ అవకాశం కల్పిస్తున్నది. 'చిల్ లైక్ ఏ ఫిన్' పేరుతో ఏడు రోజుల ఫిన్లాండ్ పర్యటనను ఆఫర్ చేస్తున్నది. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ చాలెంజ్‌లో గెలిచిన వారికి ఫిన్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన 'లేక్‌ల్యాండ్'లో విహరించే అవకాశం దక్కుతుంది. అదికూడా ఉచితంగా. ప్రయాణ ఖర్చులు మొదలుకొని, వసతి, భోజనం, ఇతర ఖర్చులన్నీ ఫిన్లాండ్ ప్రభుత్వమే భరించనున్నది. వారికి ఆనందంగా జీవించడం ఎలాగో కూడా నేర్పుతుంది. ఫిన్లాండ్ ప్రజలు ప్రకృతితో కలిసి ఎలా జీవిస్తారు? వారి జీవనశైలిలో దాగి ఉన్న ప్రశాంతత ఏమిటి? చిన్న చిన్న విషయాల్లోనూ వారు సంతోషా న్ని ఎలా వెతుక్కుంటారు? అనే విషయాలపై అవగాహన కల్పిస్తుంది.

దరఖాస్తు ఎలా?: 'చిల్ లైక్ ఏ ఫిన్' చాలెంజ్ కోసం ఫిన్లాండ్ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ నెల 29వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నది. ఇందులో పాల్గొనాలని అనుకునేవారు.. 'విజిట్ ఫిన్లాండ్' (https://www.visitfinland.com/en/) అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లి, ఒక ఆన్‌లైన్ ఫామ్ నింపాలి. మీరు ఎం దుకు సంతోషంగా ఉండాలనుకుంటున్నారు? మీ సంతోష రహస్యం ఏమిటి? అనే దానిపై ఒక చిన్న వీడియో తీసి, అందులో పోస్ట్ చేయాలి. ఒంటరిగా లేదా జంటగా కూడా ఈ చాలెంజ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది దీనికి దరఖాస్తు చేసుకుంటారు. కానీ కేవలం సుమారు 10-15 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి వారి దేశం నుంచి ఫిన్లాండ్ వెళ్లడానికి, రావడానికి విమాన టిక్కెట్లు ప్రభుత్వమే భరిస్తుంది. ఫిన్నిష్ లేక్‌ల్యాండ్ ప్రాంతంలోని విలాసవంతమైన రిసార్ట్‌లో బసతోపాటు పసందైన భోజనాన్నీ ఏర్పాటు చేస్తుంది. సంతోషంగా జీవించడంపై నిపుణులద్వారా ప్రత్యేక క్లాసులు కూడాఉంటాయి.మరెందుకు ఆలస్యం మీరూ ఈ చాలెంజ్‌లో పాల్గొనండి.

# గద్దర్ అవార్డ్స్ లో స్కాం...!

## రెండు కోట్లకు టెండర్... నాలుగు కోట్ల ఖర్చా...

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మ కంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో కుంభకోణం జరిగిందా.. కోట్ల రూపాయలు దారి మళ్లాయా? ఇందులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారా.. ముందుగా అనుకున్న దానికంటే.. ఎక్కువ ఖర్చుపెట్టారా.. ఇందులో ఎవరి పాత్ర ఎంత.. ఇప్పుడు ఇవే విషయాలను బయటపెట్టారు గులాబీ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్. గద్దర్ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసిందని శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. జ్యూరి సభ్యులను.. సినీ పెద్దలను అవమానించారని విమర్శించారు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన వ్యవహారంపై ప్రభుత్వం నోరు విప్పాలని.. ఎఫ్ డీ సీ చైర్మన్.. సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న హైటెక్స్ లో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను అందజేత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను విజ్ క్రాఫ్ట్ అనే ముంబైకి చెందిన కంపెనీకి అప్పగించింది. అయితే అందులో ఉన్న లెక్కలకు సంబంధించిన ఓ కాపీ బయటికి వచ్చింది. దీనిని శ్రవణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.అవార్డుల ఫంక్షన్ లో శ్రేయ ఘోషల్ కు 1,65,00,000, దేవిశ్రీప్రసాద్ కు 60,00,000, దేవిశ్రీప్రసాద్ టెక్ రైడర్ కు 20,00,000, నిధి అగర్వాల్‌కు 20,00,000,10,50,000,-6,50,000, వ్యాఖ్యాత లు సుమ, ప్రదీప్ కు 13 లక్షలు, కొరియోగ్రఫీ చేసిన వారికి 39,20, 000, కాస్ట్యూమ్స్ కు ఐదు లక్షలు.. ప్రయాణానికి.. బస, భోజనాల ఖర్చుకు 60 లక్షలు.. రెడ్ కార్పెట్ యాంకర్లకు ఏడు లక్షలు.. హెయిర్.. మేకప్ వేసిన వారికి ఐదు లక్షలు.. మొత్తం ఆర్టిస్టుల ఖర్చు నాలుగు కోట్ల 11 లక్షల 20,000 బిల్లు అయింది.. వేదిక.. లైటింగ్.. ఇతర ఖర్చులకు భారీగా వెచ్చించారని శ్రవణ్ ఆరోపిం చారు. ఇక ఇదే డాక్యుమెంట్లో టెండర్ కాస్ట్ కాలంలో రెండు కోట్ల 13 లక్షలని ఉందని.. అయితే అసలు బిల్లు మాత్రం నాలుగు కోట్ల 11 లక్షల ఇరవై వేలని.. అనుకున్న దానికంటే రెండు కోట్లు అదనంగా ఖర్చు పెట్టారని శ్రవణ్ ఆరోపించారు. ఈ అదనపు ఖర్చును ఎఫ్డిసి చైర్మన్ లేదా సినిమాటోగ్రఫీ మంత్రి భరిస్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు. విజ్ క్రాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిన వ్యక్తులు ఎవరని.. తెలంగాణ ప్రాంతంలో ఎటువంటి ఏజెన్సీలు లేవా.. దీనికి ఏమైనా ఓపెన్ టెండర్లు పిలిచారా.. లేదా ప్రభుత్వం తమకు కావల సిన వారికి కట్టబెట్టిందా అని.. శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉండిపో యాయని.. కానీ ఒకరోజుధూంధాం వేడుకకు నాలుగు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని శ్రవణ్ ప్రశ్నించారు.

# జమ్మికుంటలో జెపీఎల్ సీజన్-3 ప్రారంభం



జమ్మికుంట : జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్ (జెపీఎల్) సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, క్రీడాకారులు ఆయనను ఘనంగా సన్మానించారు.

### యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి
### మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఛైర్మన్ ప్రశాంత్ కుమార్ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంచుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని, తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్లు స్థానిక ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీ పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ దిడ్డి కోమల, దిడ్డి రాము, మాచెర్ల రాజు, కందాల రాము, శ్రీనివాస్, రాము, క్రీడాభిమానులు, యువత పాల్గొన్నారు.

# మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్



గుంటూరు, : 2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే 'రావాలి జగన్ – కావాలి జగన్' నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిషోర్‌చేసిన కొన్ని వ్యాఖ్యలుఅప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది.ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన 'నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను' అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరగుతాయి. 2024 ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జగన్.. మళ్లీ పీకే సలహాలు తీసుకుని సరికొత్త 'జగన్ 2.0' వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో చూడాలి.

# వంట ఎలా చేస్తున్నారు ?

## రాష్ట్ర వ్యాప్తంగా సర్వే



అమరావతి : రాష్ట్రంలో ప్రజలు వంటకు వినియోగిస్తున్న ఇంధనంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 'వంట ఎలా చేస్తున్నారు?' అంటూ ప్రభుత్వ సిబ్బంది ఇళ్ల దగ్గరకు వచ్చి ఆరా తీయడం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ వివరాలు సేకరిస్తున్నారు. 'ఏపి గ్యాస్ వినియోగదారుల సర్వే 2026' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ లక్ష్యాలను మాత్రం అధికారులు వెల్లడించడం లేదు. గ్యాస్, కిరోసిన్, కట్టెలు, గోబర్ గ్యాస్, పైపుడ్ న్యాచురల్, విద్యుత్‌లలో ఏ ఇంధనాన్ని వంట కోసం వాడుతున్నారన్న వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. ఒకే ఇంధనం వాడుతున్నారా? రెండు, అంతకన్నా ఎక్కువ ఇంధనాలను వినియోగిస్తున్నారా అన్న అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన వినియోగంలో ఉన్న వ్యత్యాసాలకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం నేపథ్యంలో ఈ సర్వే ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. పైనుండి వచ్చిన ఆదేశాల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు దిగువ స్థాయి సిబ్బంది చెబుతుంటే, ఉన్నతస్థాయి అధికారులు మాత్రం పెదవి విప్పడం లేదు. అయితే, ప్రజానీకాన్ని పైప్డ్ నెట్ వర్క్ గ్యాస్ (పిఎన్‌జి) వైపు మళ్లించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేసిన నేపథ్యంలో సర్వే లక్ష్యం కూడా అదే అయిఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లోపాయికారీ హెచ్చరిక కూడా: తాజా సర్వేలో మొత్తం కుటుంబాలను కవర్ చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వంటకు వినియోగించే విధానాన్ని తెలుసుకోనున్నారు. అలాగే సర్వే సందర్భంగా లోపాయికారీ హెచ్చరికలు కూడా జారీ చేయాలని నిర్ణయించారు. సర్వేలో వివరాలు పూర్తిగా వెల్లడిస్తే భవిష్యత్తులో వివిధ అంశాల్లో లబ్ధికి ఆస్కారం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. లేకుంటే ఇబ్బందులు తప్పవన్న సందేశాన్ని కూడా ఇస్తున్నట్లు సమాచారం.

# తెలంగాణ కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులు ఔట్..

## మంత్రివర్గంలోకి కొత్త నేతలు.. హైకమాండ్ బిగ్ ప్లాన్!

హైదరాబాద్, : తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకనున్నారు. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు.తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది.ఇక ఏ సామాజిక వర్గమంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించేవారిని కూడా అదేసామాజిక వర్గం నుంచి తీసుకు రావాలని తెలుస్తోంది.ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.అయితే మంత్రివర్గంలోమార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేం దుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారంఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమా నంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగు తోంది. ఈసారిశాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ



పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం.కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు.డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు.

# మంత్రి పదవి కోసం స్పీడ్ తగ్గించారా?



నెల్లూరు, : కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏపీ పాలిటిక్స్‌లో పరిచయం అక్కరలేని పేరు. 2014, 2019లో రెండుసార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి..గత ఎన్నికలకు ముందు ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి సైకిల్ ఎక్కారు. నెల్లూరు రూరల్‌లో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా..ఓవైపు వైసీపీని టార్గెట్ చేస్తూనే..మరోవైపు నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెడుతూ వచ్చారు. వందల కోట్ల నిధులతో నెల్లూరు రూరల్‌లో ఓ రేంజ్‌లో డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టి సీఎం చంద్రబాబుతో ప్రశంసలు పొందారు. పనితీరులో రాష్ట్రవ్యాప్తంగా 32వ స్థానం, నెల్లూరులో ఫస్ట్ ప్లేస్ సొంతం చేసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి..విస్తరణలో మంత్రి పదవి పక్కా అంటూ ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లే ఆయన కూడా దూకుడు పెంచుతూ వచ్చారు. కానీ కొన్ని రోజులుగా ఆయన తన రూట్‌ను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డికి నెంబర్ వన్ ప్లేస్ దక్కడం..సీఎం చంద్రబాబు దగ్గర ప్రశంసలు పొందడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నది పబ్లిక్ టాక్. ఎమ్మెల్యే కోటంరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఆ లోటు కనిపించకుండా గిరిధర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారట. ఒక్క మాటలో చెప్పాలంటే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అని ప్రజలు చెప్పుకునేలా వందల కోట్లతో అభివృద్ధి పనులను దగ్గరుండి జరిపిస్తున్నారట. ఇలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడం వల్లే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మంచి పేరు, ప్రశంసలు దక్కుతున్నాయని తెలుగు తమ్ముళ్లే చర్చించుకుంటున్నారట.అయితే ఒక పక్క మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెక్స్ట్ టార్గెట్ తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఎమ్మెల్యేను చేసుకోవడమేనట. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనని తన తమ్ముడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని పలు సందర్భాల్లో చెప్పారు కోటంరెడ్డి. సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు అమాత్య ఆశలను కూడా అలా పక్కన పెట్టి..నియోజకవర్గంపైనే ఫుల్ ఫోకస్ పెట్టారట కోటంరెడ్డి.రెండేళ్లు పూర్తికాక ముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.613 కోట్లతో చంద్రన్న రహదారులు, చంద్రన్న పార్కులు, చంద్రన్న వెలుగులు, బ్రిడ్జిల అభివృద్ధి పనుల జాతర చేపట్టారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఎక్కడా అవినీతికి తావు లేకుండా..ప్రతి పైసా ఖర్చు వివరాలను ప్రజలకు తెలిపేలా ఒక బుక్ లెట్ తయారు చేసి పబ్లిక్ డొమెయిన్‌లో ఉంచారట. అభివృద్ధి పనులకు సంబంధించిన బుక్లెట్‌ను సీఎం చంద్రబాబుకు కూడా చూపించారట ఎమ్మెల్యే కోటంరెడ్డి. వీటిలో కొన్ని పూర్తి కాగా..ఇంకొన్ని చివరి దశలో..మరి కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని అంటున్నారు. ఇటీవల 339 పనులను ఒకేసారి స్థానిక ప్రజలతో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించారు కోటంరెడ్డి. మరోసారి రూ.27 కోట్లతో ఈ నెల 22న స్థానిక ప్రజల చేత 240 చోట్ల ఒకేసారి ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారట.పక్కా వ్యూహం ప్రకారమే నియోజకవర్గ డెవలప్‌మెంట్‌కు టాప్ ప్రయారిటీ ఇస్తున్నారట కోటంరెడ్డి. తనకు మంత్రి పదవి వస్తే సంతోషం. కానీ వచ్చే ఎన్నికల్లో తమ్ముడిని ఎమ్మెల్యే చేసి తీరాలని పట్టుదలతో ఉన్నారట. కోటంరెడ్డికి అమాత్య యోగం ఎప్పుడు దక్కుతుందో? సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# అజార్ త్యాగయ్యేనా..!



## మెడమీద వేళాడుతున్న కత్తి

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం మాజీ క్రికెటర్, ప్రస్తుత మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామక అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండి, ఏ సభలోనూ సభ్యత్వం లేని మహ్మద్ అజారుద్దీన్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక క్లిష్ట దశకు చేరుకుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు శాసనసభ శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ గడువు ఏప్రిల్ ఆఖరుతో ముగుస్తుండటంతో, ఆయన పదవిపై సందిగ్ధత నెలకొంది.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభం నుంచీ అనేక న్యాయపరమైన, రాజకీయపరమైన చిక్కులను ఎదుర్కొంటోంది. మొదట ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల పేర్లను గవర్నర్ కోటా కింద సిఫార్సు చేయగా, గత ప్రభుత్వం నియమించిన అభ్యర్థుల తిరస్కరణపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. దీంతో ప్రభుత్వం తన ప్రతిపాదనలను మార్చాల్సి వచ్చింది. రెండోసారి కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సిఫార్సు చేసింది.సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నందున గత గవర్నర్ ఈ ఫైల్‌పై నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఫిబ్రవరి 3న సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ, గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని, కోర్టు విచారణ దానికి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. దీంతో అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకం సుగమం అవుతుందని ప్రభుత్వం భావించినా, అప్పటి గవర్నర్ బదిలీ కావడంతో ఫైల్ మళ్లీ పెండింగ్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం కొత్త గవర్నర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.ఏప్రిల్ నెలాఖరు లోపు అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేయకపోతే, ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వానికి నైతికంగా ఇబ్బందికరంగా మారుతుంది. ఒకవైపు అజారుద్దీన్ నియామకం పెండింగ్‌లో ఉండగానే, రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయనే ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా లంబాడా వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చినప్పటికీ అమలు కాకపోవడంతో, బాధితులు హైకోర్టును ఆశ్రయించవచ్చని న్యాయస్థానమే సూచించింది. దీంతో ఈ వ్యవహారం మళ్లీ న్యాయపోరాటంగా మారే అవకాశం ఉంది.ఒకవేళ గడువులోగా గవర్నర్ ఆమోద ముద్ర వేయకపోతే, అజారుద్దీన్ తన మంత్రి పదవిని కోల్పోవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల అనంతరం లేదా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఈ విషయంలో స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి:

# నిలువ నీడేది.. బస్టాండ్ జాడేది?



కాటారం : కాటారం మండల కేంద్రం నాలుగు మండలాల కూడలి నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ నిలువ నీడేది ? బస్టాండ్ జాడేది ? దీనికి ఆర్టీసీ అధికారులు ఏం సమాధానం చెబుతారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో గతంలో నిర్మించిన బస్టాండ్లు భూ వివాదాల 'సుడి'లో కనుమరుగయ్యాయి. ఏదేమైనా ఇప్పుడు కష్టాలు పడుతున్నది ప్రయాణికులు. కాటారం మండల కేంద్రం నుంచి కరీంనగర్, కాళేశ్వరం, వరంగల్, గోదావరిఖని ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో బస్సులు, వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. అయితే నిలువ నీడలేక ఎండ, వానలకు దుకాణాల ముందు తలదాచుకోవడం తప్పడం లేదు. రద్దీ పెరిగితే రోడ్లపైనే పడిగాపులు తప్పవు.ఎండాకాలంలో ఎన్ని తిప్పలో..: రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగు తోంది.కాటారం మండల కేంద్రంలోనిలువ నీడ లేక మండే ఎండలోనే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన వస్తోంది. తలదాచుకు నేందుకు నీడ లేక, తాగడానికి నీరు లేక ప్రయాణికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. మరోవైపు కాలకృత్యాలకు దిక్కులు చూడాల్సిన దుస్థితి నెలకొన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. దీనికి తోడు మండలాల్లో ప్రయాణికులకు ఎలాంటి సదుపాయాలు లేక మండుటెండలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రవాణా చార్జీలు పెంచి వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాల కల్పన పై నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

అధికారులకు పట్టింపేదీ..: కాటారం మండల కేంద్రంలో మూడు దశాబ్దాల క్రితమే ఒకటి చాలదన్నట్లు రెండు బస్టాండ్లు నిర్మించారు. మంథని రహదారి మార్గంలో ఒకటి.. మహాదేవపూర్ వెళ్లే మార్గంలో( ప్రభుత్వాసుపత్రి సమీపంలో) మరొకటి నిర్మించినా ఏళ్ల తరబడిగా వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో శిథిలావస్థకు కూడా చేరాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్ ల కోసం భూములు ఇచ్చిన వారే తిరిగి వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయడంతో వివాదాలు న్యాయస్థానాల దాకా వెళ్లాయి. కాటారంలో ధరలు పెరిగిన క్రమంలోనే ఇలా జరిగిందన్నది ప్రచారంలో ఉంది.

కాటారం మండల కేంద్రంలో ఇదీ పరిస్థితి..: కాటారం మండల కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాల్లో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజలు నిత్యం వందల సంఖ్యలో వివిధ పనులు, ఆసుపత్రులు, నిత్యావసర సరుకులు, సామగ్రి కొనుగోలు కోసం కాటారం మండల కేంద్రానికి వస్తుంటారు.

# తెరపైకి కంటెస్టెడ్..

నిజామాబాద్: రాజకీయాల్లో గెలిచిన నేతలకే పదవి, పలుకుబడి, గౌరవం ఉంటాయి. పనులు చేయించేది, ప్రజల తరఫున సమావేశాల్లో ప్రశ్నించేది కూడా పదవిలో ఉన్నవారే. మెజారిటీ సీట్లు గెలిస్తే అధికారపక్షం అంటారు.. తక్కువ సీట్లు వస్తే ప్రతిపక్షంలో కూర్చుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది కామన్. కానీ కరీంనగర్‌లో ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పెత్తనం చెలాయించే వ్యూహం రూపొదిస్తున్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులతో సమానంగా 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే', 'కంటెస్టెడ్ కార్పొరేటర్' గా స్వయంగా ప్రకటించుకుంటున్నారు. ఈమేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాహనాలకు స్టిక్కర్లు పెట్టుకుంటున్నారు. విజిటింగ్ కార్డులు ఇస్తున్నారు. ఈ వింత పరిణామం స్థానిక పాలనలో గందరగోళాన్ని సృష్టిస్తుంది.కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కార్పొరేటర్ స్థానాలు గెలిచి పీఠం దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ జరిగింది. అధికార కాంగ్రెస్ పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డినా ప్రజలు కమలం వైపే మొగ్గుచూపారు. ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులను కలుపుకుని పీఠం కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు చేశారు. కానీ బీఆర్ఎస్ హ్యాండ్ ఇవ్వడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయ. ఇక ఓడిపోయిన నాయకులు పార్టీలోని నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'కంటెస్టెడ్' పేరుతో సొంతంగా లేని పదవులు సృష్టించుకుని అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది కొత్త ట్రెండ్‌గా మారింది.ఈమేరకు పెద్ద ఫ్లెక్సీలపై 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే/కార్పొరేటర్' అని పేరుపెట్టి రోడ్లపై ఏర్పాటు. మానకొండూరు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొందరు కార్లపై స్టికర్లు అంటించుకుని అధికారిక స్థాయిలో తిరుగుతున్నారు.

మరికొందరు కలెక్టర్లు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో విజిటింగ్ కార్డులతో హాజరవుతుఅన్నరు. స్థానిక సమస్యల సమావేశాల్లో ప్రధాన అతిథులుగా పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓడిపోయిన అభ్యర్థులు ఎక్కువగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు.కంటెస్టెడ్ ట్రెండ్‌ను గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికార దుర్వినియోగంగా పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ స్థాయిలో డిసిప్లినరీ చర్యలు, పబ్లిక్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజల్లో గందరగోళం పెరిగి, నిజ అధికారులను గుర్తించడం కష్టమవుతోంది.

# కేసుల దర్యాప్తులో అలసత్వం వహించొద్దు

## ఎస్పీ శరత్‌చంద్ర పవార్




నీలగిరి: పోలీస్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. మంగళవారం నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్ విభాగం, లాక్ అప్, ఎస్.హెచ్.ఓ గది తదితర విభాగాలను ఎస్పీ పరిశీలించి, స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగావిచారణ చేసి, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణ స్పందన చూపాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ విధుల్లో ఉన్న సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేకదృష్టి సారించి, మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచిం చారు. సైబర్ క్రైమ్ మరియు డయల్ 100 సేవల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్.ఐ శంకర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు వరుస షాక్



గౌహతి: దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. పొత్తులు, సీట్ల సర్దుబాట్లు కూడా కొలిక్కి వచ్చాయి. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, పార్టీలు ప్రచారం జోరు కూడా పెంచుతున్నాయి. అయితే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో కాంగ్రెస్ బలంగా కనిపిస్తోంది. అయితే ఈ సమయంలో ఆ పార్టీ నేతలు షాక్ ఇస్తున్నారు. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర బోరా తర్వాత మార్గరీటా ఎంపీ ప్రద్యుత్ బోర్గులై రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు ప్రతీక్ కూడా పార్టీ టిక్కెట్ తిరస్కరించి పోటీకి సిద్ధం కాదని ప్రకటించడంతో పార్టీకి మరింత షాక్.ప్రద్యుత్ బోర్గులై, నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎంపీ, అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి రాజానామా చేశారు. భూపేంద్ర బోరా రాజీనామా తర్వాత ఇది మరో దెబ్బ. మార్గరీటా అసెంబ్లీ స్థానానికి ప్రతీక్ బోర్గులై ప్రకటించింది కాంగ్రెస్. అయితే తాను పోటీ చేయనని తెలిపారు. ఈ సంఘటనలు పార్టీ స్థిరత్వాన్ని దెబ్బతీశాయి.


ప్రద్యుత్ రాజీనామాతో పాటు 80 మంది కీలక కార్యకర్తలు కాంగ్రెస్ వదిలేశారు. ఎన్నికల ముందే ఈ సంఖ్యలో వలసలు పార్టీ ఓటు బ్యాంకును బలహీనపరుస్తున్నాయి. బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మీడియా ద్వారా మాజీ కాంగ్రెస్ నేతలను ఆకర్షిస్తూ పార్టీ బలం పెంచుకుంటోంది.కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక, నాయకత్వ విభేదాలు ప్రధాన కారణాలు. ఒకప్పుడు అస్సాంలో బలమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యం ముందు బలహీనపడుతోంది. రాహుల్, ప్రియాంక గాంధీ ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఈ వలసలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి.బీజేపీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ బలహీనతను హైలైట్ చేస్తోంది. మార్గరీటా స్థానంలో తండ్రి?కొడుకుల విభజన రాజకీయ ఆసక్తిని రేపుతోంది. కాంగ్రెస్ ఈ సంక్షోభాన్ని అధిగమించకపోతే అస్సాంలో మరింత బలహీనపడుతుంది.

# సీఎన్‌జీ గ్యాస్ కోసం మూడు కిలోమీటర్ల వరకు బారులు తీరిన ఆటోలు..!



హైదరాబాద్ : పెట్రోల్, డీజిల్ కొరతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో ఈ దుస్థితి మరింతగా నెలకొన్నది. సీఎన్‌జీ గ్యాస్ కోసం బుధవారం అంబర్‌పేటలో మూడు కిలోమీటర్ల మేర క్యూలైన్‌లో వేచి ఉండటం పరిస్థితికి అద్దం పడుతున్నది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక బంకులు మూతపడ్డాయి. ఎక్కడ చూసినా బంకుల ముందు నోస్టాక్ బోర్డులే దర్శనమిచ్చాయి. కాగా, హైదరాబాద్ నగరంలో వాహన ఎల్‌పీజీ గ్యాస్ ధరలు ఇష్టానుసారంగా పెంచుతున్నారని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఎల్‌పీజీ ధర రూ.63 ఉండగా, ఇప్పుడు రూ.90 దాటిందని వాపోతున్నారు. ఆయిల్ కంపెనీలు ఇంధన సరఫరా చేయడం లేదని ఎల్‌పీజీ, సీఎన్‌జీ బంక్‌ల వద్ద నిర్వాహకులు నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని వాపోయారు. సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, సనత్‌నగర్, ఎల్‌బీనగర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లోని బంక్‌ల వద్ద ఆటోలు ఎల్‌పీజీ, సీఎన్‌జీ కోసం భారీగా క్యూ కట్టాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 460కి పైగా పెట్రోల్ బంకులు ఉండగా, అందులో 95 స్టేషన్లలో గ్యాస్ పంపులు అందుబాటులో ఉన్నాయి. మరో 35 కేంద్రాల్లో నేచురల్ గ్యాస్ కేంద్రాలు కొనసాగుతున్నాయి.

# కాంగ్రెస్ కు డూ ఆర్ డై!



తిరువనంతపురం: కేరళ రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీ ఒక అసాధారణ గండం ఎదుర్కొంటోంది. దశాబ్దాలుగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి అధికారం మార్పిడి జరిగే సంప్రదాయానికి గత ఎన్నికల్లో తెరపడింది. ఎల్‌డీఎఫ్ వరుసగా రెండోసారి పీఠాన్ని దక్కించుకోవడంతో, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రాబోయే ఎన్నికలు కేరళ కాంగ్రెస్‌కు కేవలం అధికారం కోసం మాత్రమే కాదు, ఆ పార్టీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న జీవన్మరణపోరాటం.కేరళలో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. సాధారణంగా అధికారం మారుతుందన్న ధీమాతో ఉన్న కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో లెఫ్ట్ కూటమి వ్యూహాలను అంచనా వేయడంలో విఫలమైంది. పినరయి విజయన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ముఖ్యంగా విపత్తుల సమయంలో వారు చూపిన చొరవ ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత విభేదాలు, బలమైన నాయకత్వం లేకపోవడం ఆ పార్టీని ప్రతిపక్షానికే పరిమితం చేశాయి. రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచారు. ఇప్పుడు ప్రియాంకా గాంధీ ఎంపీగా ఉన్నారు. ఆమె కేరళ రాజకీయాల్లో చురుగ్గా జోక్యం చేసుకోవడం వల్ల ఈ ఎన్నికల ఫలితాలు నేరుగా గాంధీ కుటుంబంపై ప్రభావం చూపుతాయి. దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణ తర్వాత కాంగ్రెస్‌కు బలమైన పట్టున్న రాష్ట్రం కేరళ. ఇక్కడ కూడా వరుసగా మూడో సారి ఓడిపోతే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వ సామర్థ్యంపై, గాంధీ వారసుల విన్నింగ్ కెపాసిటీ పై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తుతాయి.కేరళలో ఇప్పటివరకు ప్రధాన పోటీ కాంగ్రెస్, లెఫ్ట్ కూటముల మధ్యే ఉన్నప్పటికీ, ఈసారి సీన్ మారుతోంది. కాంగ్రెస్ బలహీనపడితే ఆ ఖాళీని భర్తీ చేసేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇప్పటికే క్రైస్తవ సామాజిక వర్గాలను ఆకర్షించడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌లో చీలిక వస్తే, అది బీజేపీకి వరంగా మారుతుంది. త్రిముఖ పోటీ ఏర్పడితే అది కాంగ్రెస్‌కు మరింత నష్టదాయకంఒకవేళ ఈసారి కూడా కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకోలేకపోతే, కేరళలో ఆ పార్టీ బెంగాల్ లేదా త్రిపుర తరహాలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కార్యకర్తల్లో నైతిక స్థైర్యం దెబ్బతినకుండా ఉండాలంటే విజయం తప్పనిసరి. అందుకే ఈసారి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు హైకమాండ్ ప్రత్యేక దృష్టి సారించింది. లెఫ్ట్ కూటమిని ఎదుర్కో వడానికి మతపరమైన సమీకరణాలను, యువ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపైనే కాంగ్రెస్‌భవిష్యత్తు ఆధారపడి ఉంది. కేరళ ఎన్నికలు దేశ రాజకీయాల్లోనే అత్యంత కీలకంగా మారాయి. పినరయి విజయన్ హ్యాట్రిక్ కొడతారా? లేకకాంగ్రెస్ తన పాత వైభవాన్ని చాటుకుంటుం దా? అన్నది ఇప్పుడు ఆసక్తికరం. కాంగ్రెస్‌కు ఇది ఇప్పుడు కాకపోతే ఇంకెప్పటికీ కాదు అనే పరిస్థితి. ఈ పోరులో గెలిస్తేనే రాహుల్ గాంధీ నాయకత్వానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుంది, లేదంటే కేరళ గడ్డపై కాంగ్రెస్ జెండా మరింత పలచబడటం ఖాయం.

# అస్సాం కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?



గౌహతి, : అస్సాం రాజకీయాల్లో రోజు రోజుకు సంచలన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏప్రిల్ 9, 2026న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కేవలం మూడు వారాల ముందు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నాగావ్ లోక్ సభ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ప్రద్యుత్ బోర్డోలోయ్ రాజీనామాకు ప్రధాన కారణం లాహోరిగిట్ నియోజకవర్గ అభ్యర్థి ఎంపిక. వివాదాస్పద నేపథ్యం ఉన్న ఎమ్మెల్యే ఆసిఫ్ మహమ్మద్ నాజర్ కు మళ్ళీ టికెట్ ఇవ్వడాన్ని బోర్డోలోయ్ తీవ్రంగా వ్యతిరేకించారు. తనపై గతంలో జరిగిన దాడి వెనుక నాజర్ అనుచరుల హస్తం ఉందని, అటువంటి వారికి పార్టీ పెద్దపీట వేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ హైకమాండ్‌కు అల్టిమేటం ఇచ్చినప్పటికీ, నాయకత్వం స్పందించకపోవడంతో ఆయన బయటకు వచ్చారు. అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తీరుపై బోర్డోలోయ్ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. నేర చరిత్ర ఉన్నవారికి గొగోయ్ మద్దతు ఇస్తున్నారని, పార్టీలో సీనియర్లకు గౌరవం దక్కడం లేదని ఆయన ఆరోపించారు. కేవలం గొగోయ్ మాత్రమే కాకుండా, ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సభ్యుడు ఇమ్రాన్ మసూద్ తన ఫిర్యాదులను తప్పుడు సమాచారంగా కొట్టిపారేయడం తనను అవమానించినట్లేనని ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. బోర్డోలోయ్ నిష్క్రమణ కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ. రాష్ట్రంలో పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న కీలక నేత ఎన్నికల ముందే ప్రత్యర్థి పార్టీలో చేరడం వల్ల ఓటర్లలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతకుముందే మాజీ పీసీసీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా కూడా పార్టీ వీడటం చూస్తుంటే, కాంగ్రెస్‌లో సంస్థాగత వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో బోర్డోలోయ్ బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో, అధికార పార్టీ తన బలాన్ని మరింత పెంచు కుంది. ముఖ్యంగా అప్పర్ అస్సాం, నాగావ్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పట్టుకోల్పోయే అవకాశం ఉంది.మరోవైపు, కాంగ్రెస్ మాత్రం బోర్డోలో య్ వెళ్ళిపోవడం వల్ల నష్టమేమీ లేదని, ఆయనపై బీజేపీ ఒత్తిడి ఉండి ఉండవచ్చని పైకి చెబుతున్నా, లోలోపల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై మిగిలిన నాయకుల్లో కూడా ఆందోళన మొదలైంది

# రద్దు యోచనలేదు


## క్లారిటీ ఇచ్చిన విద్యాకమిషన్

హైదరాబాద్,: తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే వార్తలు గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి బోర్డు పరీక్షలు రద్దు కానున్నాయన్న ప్రచారంపై విద్యాశాఖ కమిషన్ తాజాగా కీలక వివరణ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల రద్దుపై వస్తున్న వార్తలను తెలంగాణ విద్యాశాఖ కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ ఖండించారు. తాము ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సిఫార్సు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం విడివిడిగా ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డును, ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయాలని ప్రతిపాదించారు. కేవలం 11వ తరగతి పబ్లిక్ పరీక్షలను మాత్రమే రద్దు చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆమె విజ్ఞప్తి చేశారుమరోవైపు సీఎం రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా +2 విధానాన్ని రాష్ట్రంలోనూ బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో విద్యా సంస్కరణలపై ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం కొనసాగుతోందని, కమిషన్ ఇచ్చేది తుది నివేదిక కాదని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ విద్యా రంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు.మార్చి 20న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఇదే క్రమంలో విపక్షాలపై ఆయన ఘాటైన విమర్శలు చేశారు. బడ్జెట్‌ను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకుని అసెంబ్లీ నుండి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరును ఆయన ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపై, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై సీఎం తనదైన శైలిలో సెటైర్లు వేశారు.ప్రస్తుతానికి పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై అధికారికంగా ఎటువంటి జీవో వెలువడలేదు. విద్యాశాఖ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనుంది. విద్యార్థులు తమ విద్యా ప్రణాళికను యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

# ఇరాన్ తో ఉత్తరకొరియా

టెహ్రాన్: ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ యుద్ధం మొదలై 18 రోజులైంది. ఇంతకాలం కొనసాగుతుందని ఎవరూ ఊహించలేదు. ఇంతలా ప్రతిఘటిస్తామని ఇరాన్, ఇంతకాలం యుద్ధం చేయాల్సి వస్తుందని అమెరికా కూడా అంచనా వేయలేదు. కానీ ఇరాన్ అమెరికాను భయపెడుతోంది. వ్యూహాత్మకంగా అమెరికాను దెబ్బతీస్తోంది. అమెరికాపై ఒత్తిడి తెస్తోంది. ఈ తరుణంలో హార్మూజ్ జలసంధి వద్ద నౌకలు నిలిచిపోయాయి. ఇలాంటి తరుణంలో యురోపియన్ యూనియన్ దేశాలకు చమురు సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో అమెరికా యుద్ధంతో తమతో కలిసి రావాలని నాటో దేశాలను కోరింది. అయినా ఎవరూ ముందుకు రావడం లేదు.ఈ వార్‌లోకి ఉత్తర కొరియా ఎంటర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే యుద్ధం లక్ష్యం ఏమిటో ఎన్నాళ్లు కొనసాగుతుందో అమెరికా అంచనా వేయలేకపోతోంది. ఈ తరుణంలో ఉత్తర కొరియా రంగంలోకి దిగితే అమెరికాకు ఇబ్బందులు తప్పవు. ఎందుకంటే ఉత్తర కొరియా అణ్వాయుధ దేశం. దక్షిణ కొరియా అమెరికా మిత్ర దేశం దీనికి ఉత్తర కొరియాతో ఇబ్బందులు ఉన్నా అమెరికా ఆ దేశంపై దాడి చేయకపోవడానికి కారణం అణ్వాయుధమేయుద్ధం జరుగుతున్న వేళ ఇరాన్ 'డ్యాన్సింగ్ మిస్సైల్' ప్రయోగం (10 వేల కి.మీ. రేంజ్, అర్బిటల్ ట్రాజెక్టరీ)తో కొత్త ఆయుధాలు ప్రదర్శించి అమెరికా ఆధిక్యతను సవాల్ చేస్తోంది. ట్రంప్ అనుకోని ఈ దీర్ఘయుద్ధం ఖర్గ్ ఐలాండ్ దాడులు (అమెరికా చమురు మౌలిక సదుపాయాలపై)తో మరింత తీవ్రమైంది.మరోవైపు ఇరాన్ సౌదీ అరేబియాలోని అమెరికా ఎయిర్ బేస్‌లో 5 ట్యాంకర్ షిప్‌లు ధ్వంసం చేసి యుద్ధ విమానాల ఇంధన సరఫరా (గాల్లో నింపుదల) ఆపేశారు. ఈ ఆకస్మిక దాడి అమెరికా ఆపరేషన్ 'ఎపిక్ ఫ్యూరీ'ను ఆపేసి, విమానాలు లక్ష్యాలకు చేరుకోలేకపోయాయి. ఐఆర్‌జీసీ 5 వేల బాంబుల దాడులకు ప్రతిఘటనగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, మోజ్తాబా ఖమేనీపై బెదిరింకపత్రాలు జారీ చేసింది.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వీడియో ఒకటి తాజాగా వైరల్ అవుతోంది. అందుతో నెతన్యాహు కుడి చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు గుర్తించారు. దానిని వైరల్ చేస్తున్నారు. ఇది పూర్తిగా ఏఐ వీడియో అని పేర్కొంటున్నారు. ఇరాన్ దాడిలో నెతన్యాహు మరణించాడని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. బతికే ఉన్నాడని ఇజ్రాయెల్ తెలిపింది. తాజాగా మరో రెండు వీడియోలను విడుదల చేసింది. మరోవైపు అమెరికా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీని చంపుతామంటోంది. నెతన్యాహును చంపుతామని ఐఆర్‌జీసీ ప్రకటించింది.ట్రంప్ తాజాగా 'ఇరాన్‌ను చితక్కొట్టాము' అని ప్రకటించి నాటో సహాయం కోరాడు, కానీ ఎవరూ స్పందించలేదు ? కొందరు 'రామని' చెప్పారు. అమెరికా ట్రిలియన్ డాలర్ సైనిక బడ్జెట్‌కు ఉన్నప్పటికీ, 100 డ్రోన్ దాడికి 16 కోట్లక్షాలర్ల ఖర్చు అమెరికాపైఊ ఆర్థిక ఒత్తిడి సృష్టిస్తోంది. ఈ ఒంటరితనం అమెరికా వ్యూహాన్ని మార్చేస్తోంది.ఉత్తర కొరియా మద్దతుతో ఇరాన్ ఐఆర్‌జీసీ యుద్ధం దీర్ఘకాలం సాగేలా చూస్తున్నాయి. రష్యా, చైనా సహకారం (డ్రోన్‌లు, ఇంటెల్) పెరిగితే మహాయుద్ధంగా మారవచ్చు. రెండు?మూడు రోజుల్లో నాటో స్పందనలు కీలకం ? ట్రంప్ -టర్న్ (యుద్ధ ముగింపు సూచనలు) శాంతి చర్చలకు దారి తీయవచ్చు.

# రాష్ట్రంలో బ్రీజర్ల కొరత





## కృత్రిమ కొరత సృష్టించి దోపిడీ మూడు నెలలుగా సమస్య

హైదరాబాద్, : కాంగ్రెస్ సర్కార్ పాలనలో వినియోగదారులను దోచుకుంటున్నారు. రాష్ట్రంలో వేసవిలోకాలంలో ఎక్కువగా అమ్మకాలు జరిగే బ్రీజర్లు దొరకడంలేదు. మద్యంప్రియులు వేసవిలో చాలావరకు తక్కువ ఆల్కహాల్‌తోపాటు రూ. 130కే దొరికే బ్రీజర్లనే ఎక్కువగా సేవిస్తుంటారు. రెండు మూడు నెలల నుంచి మద్యం దుకాణాల్లో బ్రీజర్లు దొరకడంలేదు, రూ.210 ధర ఉన్న బ్రీజర్లు మాత్రమే లభిస్తున్నాయి. ఈ బ్రీజర్ల వెనుక భారీ కుట్ర దాగి ఉన్నదని వినియోగదారులు పేర్కొంటున్నారు. వేసవికాలానికి ముందే బ్రీజర్ల కృతిమ కొరత సృష్టించి ఎక్కువ ధర కలిగిన బ్రీజర్లు కొనుగోలు చేసేలా కుట్రలు చేస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. బ్రీజర్ల కొరత కారణంగా అదనంగా ఒక్కో బాటిల్‌కు రూ. 70 వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని మద్యంప్రియులు వాపోతున్నారు.

నెలకు 50 కేసులపైనే..: వేసవిలో ఒక్కో మద్యం షాపు నుంచి కనీసం 50 కేసుల బ్రీజర్ల అమ్మకాలు జరుపుతామని మద్యం షాపుల యజమానులు చెప్తున్నారు. దాదాపు రెండు నెలల నుంచి బ్రీజర్లు అందుబాటులో లేకపోవడంతో ధర ఎక్కువున్న వాటిని కొనుగోలు చేయలేక వినియోగదారులు వెనుదిరుగుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం బ్రీజర్లతోపాటు మరికొన్ని బ్రాండ్ల మద్యం కూడా రావడం లేదని పేర్కొంటున్నారు. దీంతో ఈ కృత్రిమ కొరత వెనుక కొందరు బడాబాబులు, ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నదని పలు అనుమాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతాలే కాక అర్బన్, నగరాల్లో కూడా ఈ బ్రీజర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నదని వినియోగదారులు వాపోతున్నారు.

# టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.223 కోట్ల వసూళ్లు



హైదరాబాద్, , : దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియలో రూ. 223.60 కోట్ల రికార్డు ఆదాయాన్ని రాబట్టినట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వే బోర్డు నిర్దేశించిన రూ . 221.08 కోట్ల లక్ష్యాన్ని, సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే ఈ జోన్ అధిగమించింది. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా వచ్చిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషం. ఇంతకు ముందు 2023-24 సంవత్సరంలో రూ . 220.81 కోట్ల ఆదాయం వచ్చింది.టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ మొదలైన వాటిపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ జోన్ ప్రస్తుత సంవత్సరంలో, 2025 అక్టోబర్ 18 న ఒకే రోజులో టికెట్ తనిఖీ ద్వారా రూ . 1.85 కోట్ల రికార్డు ఆదాయాన్ని ఆర్జించింది. రైల్వేలలో టిక్కెట్ల తనిఖీ అనేది, టిక్కెట్టు లేని, సరైన ఆధారాలు లేకుండా చేసే ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అలవాటుగా ప్రతినిత్యం టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారిని నిరోదిస్తూ, బుకింగ్ విండోల ద్వారా టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడుతుంది.రైలు ప్రయాణంలో అధీకృత టిక్కెట్ లేదా ప్రయాణ పత్రం కలిగి ఉండటం ప్రాముఖ్యత గురించి సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి కూడా ఇది సహాయపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. అంతేకాకుండా టిక్కెట్ల తనిఖీ చెల్లుబాటు అయ్యే టిక్కెట్లతో ప్రయాణించడంలో ఉండే సౌకర్యం గురించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి తోడ్పడుతుంది. ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, టిక్కెట్ల అమ్మకాలను పెంచడానికి, బుకింగ్ విండోతో పాటు, టిక్కెట్ల జారీ కోసం టిక్కెటింగ్ వ్యవస్థలో అనేక డిజిటల్ కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ డిజిటల్ కార్యక్రమాలలో రైల్ వన్ యాప్, బుకింగ్ కౌంటర్ల దగ్గర ఏటీవీఎంలు, స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌ల టిక్కెట్ కొనుగోలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

# ముగియనున్న సర్పంచ్ ల పదవీల కాలం..!

విజయవాడ, : రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గ్రామ పాలనపై ఆసక్తికర పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ ఎలా ఉండబోతుందన్న దానిపై స్పష్టత కోసం ప్రజలు, స్థానిక నాయకులు ఎదురు చూస్తున్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు, మౌలిక వసతుల కల్పన, కేంద్ర? రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను ఈ ఐదేళ్లలో నిర్వర్తించారు. రహదారులు, తాగునీటి పథకాలు, పారిశుధ్య కార్యక్రమాలు, వీధి దీపాల ఏర్పాటు, చెత్త నిర్వహణ వంటి అంశాల్లో కొంతమేర అభివృద్ధి కనిపించినప్పటికీ, నిధుల కొరత, అధికార పరిమితులు, వివిధ శాఖల మధ్య సమన్వయం లోపం వంటి సమస్యలు కూడా ఎదురయ్యాయని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు.పదవీకాలం ముగిసే సమయానికి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రారంభమైన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఎన్నికలు జరిగే వరకు పెద్దస్థాయి అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవచ్చని తెలుస్తోంది.సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీల పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు లేదా మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చి పరిపాలన కొనసాగించే విధానం అమలులో ఉంటుంది. ఈసారి కూడా అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. కొత్త ఎన్నికలపై స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే కొత్త అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి. యువత, మహిళలు కూడా ఈసారి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాధాన్యత, పార్టీ అనుబంధాలు వంటి అంశాలు కూడా రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.తమ పదవీకాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేశామని చాలా మంది సర్పంచ్‌లు చెబుతున్నారు. అయితే నిధుల కొరత వల్ల అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయామని కొందరు పేర్కొంటున్నారు. కేంద్రం నుంచి వచ్చే పంచాయతీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సమయానికి అందకపోవడం కూడా సమస్యగా మారిందని అంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు తమ వ్యక్తిగత నిధులతో కూడా అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశముంది. పలు గ్రామాల్లో యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు స్థానిక పాలనలోకి రావాలని ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో ఇప్పటికే ఉన్న నాయకులు మళ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, పారదర్శక పాలన అందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి అంశాల్లో కొత్త నాయకత్వం కీలక పాత్ర పోషించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా, గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది. కొత్త ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చిన తర్వాత గ్రామాల్లో రాజకీయ చైతన్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఈ మార్పులు రాబోయే రోజుల్లో గ్రామ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.

# ఈ కుర్రాడు ఇంకో నాని అవ్వడం ఖాయం

## బ్యాండ్ మేళం' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో బండ్ల గణేష్ కామెంట్స్ వైరల్..



హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన లేటెస్ట్ చిత్రం 'బ్యాండ్ మేళం' విడుదలకు సిద్ధమవుతోంది. 'కోర్ట్' సినిమాలో జంటగా ఆకట్టుకున్న ఈ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దర్శకుడు సతీశ్ జవ్వాజి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కోన వెంకట్ నిర్మించారు. శ్రీరామ నవమి సందర్భంగా మార్చి 26న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో శ్రీవిష్ణు, దర్శకులు వీవీ వినాయక్, బాబీ కొల్లి, అలాగే నిర్మాత బండ్ల గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో ముఖ్యంగా బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. హర్ష్ రోషన్ ప్రతిభపై ప్రశంసలు కురిపించిన బండ్ల గణేష్, "హర్ష్ రోషన్ నా కొడుకైతే ఎంత బాగుండేది అనిపించింది. అతడిలో మంచి టాలెంట్ ఉంది. భవిష్యత్తులో అతడు ఇంకో నానిలా ఎదగగలడు" అని అన్నారు. అలాగే సినీ పరిశ్రమలో స్టార్ హీరోల వారసులు స్టార్ అవడం చాలా అరుదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో మహేష్ బాబు, రామ్ చరణ్ ఉదాహరణలుగా చెబుతూ, వారసత్వంగా ఆస్తులు అందు తాయి కానీ సక్సెస్ మాత్రం ప్రతి ఒక్కరూ తమ ప్రతిభతోనే సాధిం చాల్సి ఉంటుందని చెప్పారు. ఇక నిర్మాత కోన వెంకట్ గురించి మాట్లాడుతూ బండ్ల గణేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇండస్ట్రీ మొత్తం ఒక వైపు ఉన్నా, కోన వెంకట్ వైపు ఉంటే విజయం సాధించొచ్చు అని వీవీ వినాయక్ చెప్పాడు. కోన వెంకట్ ఈ సినిమా కోసం తన ఆస్తులను అమ్మి మరీ 'బ్యాండ్ మేళం' తెరకెక్కించాడు" అని తెలిపారు. కోన వెంకట్ సినీ రంగానికి చేసిన సేవలను కూడా ఆయన గుర్తు చేశారు. దర్శకులు హరీష్ శంకర్, బాబీ, గోపీచంద్ మలినేని, శివ నిర్వాణ వంటి ప్రతిభావంతులకు అవకాశాలు కల్పిం చిన వ్యక్తి కోన వెంకట్‌అని కొనియాడారు. మొత్తంగా 'బ్యాండ్ మేళం' ప్రీరిలీజ్ ఈవెంట్ సందడి నడుమ, బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఇక శ్రీరామ నవమి సందర్భంగా విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు అలరిస్తుందో చూడాలి.


# సినిమా

# జూన్‌లో మల్టీస్టారర్ షురూ




ఈ ఏడాది 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ విజయోత్సాహంలో ఆయన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్ కలిసి నటించనున్న ఈ మల్టీస్టారర్ జూన్ నెలోలో సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. షైన్‌స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన హాస్యం, యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇందులో ఓ కథానాయికగా కీర్తి సురేష్‌ను ఖరారు చేశారని, మరో నాయిక కోసం చిత్రబృందం అన్వేషణలో ఉందని సమాచారం. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నారు వెంకటేష్. చిత్రీకరణ జరుగుతున్నది. ఇది పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి మల్టీస్టారర్‌లో వెంకటేష్ జాయిన్ కానున్నారు. ఈ సినిమాను కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

# శ్రీలీలకు వరుస ఫ్లాపులు..?



టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల, చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. 'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా, ఆమె నటించిన చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవడం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. టాలీవుడ్‌లో తిరిగి తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# మెగా 158 షూటింగ్!






మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నారని తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.


# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసంఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తనపేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధిం చిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎలాట్‌ఫారమ్‌లు,స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ంఎ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి.

# దురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు





తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన
3చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది' అని దర్శకుడు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మార్చి 19న విడుదలైన 'ధురంధర్ 2' చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ. 750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343